సాక్షి సూర్యాపేట

సోమవారం ‌। 23 । సెప్టెంబర్ । 2024



సాగర్‌కు చేరుకున్న బైక్ ర్యాలీ

పర్యాటక అభివృద్ధి సంస్థ, హైదరాబాద్ బైక్ రైడర్ల అసోసియేషన్ నిర్వహించిన బైకుల నిర్వాణ ర్యాలీ బుద్ధవనం చేరుకుంది. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం:	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 589.40 అడుగులు
ఇన్‌ఫ్లో	: 44,328 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 44,328 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29,070 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 10,200 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 2,818 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1800
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం:	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం:	644.40 అడుగులు
ఇన్‌ఫ్లో	: 4400 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 4400 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 268 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 121 క్యూసెక్కులు

చెరువులు నిండాయి



అలుగుపోస్తున్న పెన్‌పహాడ్ మండలంలోని చీదెళ్ల పెద్ద చెరువు

- జూన్ నుంచి ఇప్పటివరకు 779.02 మి.మీ వర్షపాతం నమోదు
- జిల్లాలో 1,225 చెరువులు, కుంటలు
- పూర్తిస్థాయిలో నిండినవి 783
- 75 శాతం నిండిన 369 చెరువులు

భానుపురి (సూర్యాపేట): జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది వర్షం దంచికొట్టింది. నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించిన సమయంలో కొంత తక్కువ గానే వర్షపాతం నమోదుకాగా ఈ నెల ప్రారంభంలో తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు మత్తడి దూకాయి. జిల్లా వ్యాప్తంగా 783 చెరువులు నిండుకుండలా మారాయి. నైరుతి రుతు పవనాల సీజన్‌లో జిల్లాలో సాధారణ వర్షపాతం 605.7 మి.మీ ఉండాలి. ఈనెల 22వ తేదీనాటికి 493.8 మి.మీ కురవాల్సి ఉంది. అయితే ఇప్పటికే కురవాల్సిన దానికంటే 37 శాతం అధికంగా అంటే 779.02 మి.మీ వర్షపాతం నమోదైంది. జూన్‌లో సాధారణ వర్షపాతం 96.1 మి.మీ కాగా 52 శాతం అధికంగా 146.5 మి.మీ, జూలైలో 178.8 మి.మీట ర్లకు గాను 13 శాతం లోటు వర్షపాతం 155.4 మి.మీ, ఆగస్టులో 176.1 మిల్లీ మీటర్లకు గాను 8 శాతం లోటుతో 161.4 మి.మీ వర్షం పడింది. ఈనెలలో 118.04 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా.. 22వ తేదీ వరకు 315.09 మి.మీ వర్షం కురిసింది.

నియోజకవర్గాల వారీగా నిండిన చెరువుల వివరాలు					
నియోజకవర్గం	25%	50- 75%	75- 100%	అలుగు పారినవి	మొత్తం
హుజూర్‌నగర్	07	00	15	127	149
కోదాడ	10	00	20	79	109
తుంగతుర్తి	-	35	185	384	604
సూర్యాపేట	-	21	149	193	363
మొత్తం	17	56	369	783	

వర్షపాతం ఇలా (మిల్లీమీటర్లలో)		
నెల	కురవాల్సింది	కురిసింది
జూన్	96.1	146.5
జూలై	178.8	155.4
ఆగస్టు	176.1	161.4
సెప్టెంబర్	118.04	315.09
(22వ తేదీ వరకు)		

17 చెరువుల్లోకి మాత్రమే 25 శాతం వరకు నీరు..

జిల్లాలో 1,225 చెరువులు, కుంటలు ఉన్నాయి. ఇప్పటికే 783 చెరువులు అలుగులు పోస్తున్నాయి. 369 చెరువులు కుంటలు 75 శాతానికి పైగా నిండాయి. మరో 56 చెరువుల్లోకి 50 నుంచి 75 శాతం మేర నీరు చేరగా 17 చెరువుల్లోకి మాత్రమే 25 శాతం వరకు నీరు చేరింది. జిల్లాలో అత్యధికంగా తుంగతుర్తి నియోజకవర్గంలో 604 చెరువులు ఉండగా 384 చెరువులు మత్తడి దూకాయి. సూర్యాపేట నియోజకవర్గంలో 193 చెరువులు, హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 127 చెరువులు, కోదాడ నియోజకవర్గంలో 79 చెరువులు అలుగులు పారాయి.

పాఠశాలలకు నిర్వహణ నిధులు

- 889 స్కూళ్లకు 50 శాతం చొప్పున నిధులు మంజూరు
- క్రీడా నిధులు కూడా విడుదల
- ఊపిరి పీల్చుకున్న హెచ్‌ఎంలు



హుజూర్‌నగర్: నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైన నాటి నుంచి నిధుల కొరతతో సతమతమవుతున్న పాఠశాలలకు ప్రభుత్వం ఊరట కలిగించింది. బడుల నిర్వహణ భారమవుతున్న నేపథ్యంలో నిర్వహణ నిధులు మంజూరు కావడంతో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు. నిర్వహణ నిధులతోపాటు క్రీడా నిధులు కూడా మంజూరు చేశారు. ప్రస్తుత విద్యాసంవత్సరానికి ప్రాథమిక పాఠశాలకు రూ.5 వేలు, ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.10 వేలు, ఉన్నత పాఠశాలలకు రూ.25 వేల చొప్పున మొదటి విడతగా 50 శాతం నిధులు మంజూరు చేస్తూ సమగ్ర శిక్ష అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

889 పాఠశాలలకు రూ.1,51,80,000

జిల్లాలోని 889 పాఠశాలలకు గాను నిర్వహణ, క్రీడా పరికరాల కొనుగోలు నిమిత్తం ప్రభుత్వం తొలివిడతగా 50 శాతం చొప్పున రూ 1,51,80,000 నిధులు మంజూరు చేసింది. వాటిలో పాఠశాల నిర్వహణకు రూ. 1,08,42,500, క్రీడా పరికరాల కొనుగోలుకు రూ.43,37,500లు చొప్పున మంజూరయ్యాయి. ఈ నిధులు ప్రభుత్వం ఆయా పాఠశాలల ఖాతాల్లో జమ చేసింది. వాస్తవానికి పాఠశాలల్లో చాక్‌పీసులు, రిజిస్టర్లు, స్టేషనరీ, చిన్న చిన్న మరమ్మతులు, బిల్లుల చెల్లింపు, ప్రయోగ పరికరాల కొనుగోలు, ఇంటర్‌నెట్ చార్జీల వంటి వాటికి ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకూ ఒక్క పైసా రాలేదు. దీంతో హెచ్‌ఎంలు ఇబ్బందులు పడ్డారు. అత్యవసర సమయాల్లో వారే సొంతంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎట్టకేలకు నిధులు మంజూరు కావడంతో ఉపాధ్యాయుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. పాఠశాలల యాజమాన్య కమిటీ ద్వారా ఈ నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

నిబంధనల ప్రకారం వినియోగించుకోవాలి



జిల్లాలోని 889 ప్రభుత్వ పాఠశాలలకు తొలి విడతగా 50 శాతం నిధులు వచ్చాయి. ఈ నిధులు ఇప్పటికే ఆయా పాఠశాలల పబ్లిక్ ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్ సిస్టం (పీఎఫ్ ఎంఎస్) అకౌంట్లలో జమ అయ్యాయి. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు వాటిని నిబంధన ప్రకారం డ్రా చేసి పాఠశాలల యాజమాన్య కమిటీల తీర్మానాల ప్రకారం ఖర్చు చేయాల్సి ఉంటుంది.

– కందిబండ శ్రావణ్ కుమార్, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్, సూర్యాపేట

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

చివ్వెంల(సూర్యాపేట): జిల్లా వ్యాప్తంగా ఈనెల 28న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోవర్ధన్‌రెడ్డి కోరారు. ఆదివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరిగి పరిష్కారం కాని సివిల్, క్రిమినల్, వెహికల్, విద్యుత్, బ్యాంకు, ఎక్సైజ్ వంటి కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. రాజీమార్గమే రాజ మార్గమని, దీని వల్ల ఇరువర్గాల వారు గెలిచిన వారవుతారన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యే కేసులకు సంబంధించి వేరే కోర్టుకు అప్పీల్‌కు వెళ్లే అవకాశం ఉండదన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లి దేవాలయంలో నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని ఆదివారం విశేషంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, నిత్య హోమం పూర్తిచేసి శ్రీమూలవిరాట్ స్వామిని పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల సంవాదం జరిపించారు. నిత్యకల్యాణాన్ని వేద మంత్రోచ్చరణలతో వైభవంగా నిర్వహించారు. మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, వంశీకృష్ణమాచార్యులు, ఆంజనేయాచార్యులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు పాల్గొన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆదివారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువ జామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, ఆరాధన చేపట్టారు. అనంతరం నిజాభిషేకం, తులసీదళ అర్చన చేశారు. ఇక ప్రథమ ప్రాకార మండపం, ముఖ మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, అష్టోత్తర పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవను ఊరేగించారు.రాత్రి స్వామి, అమ్మవారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

విద్యా సదస్సును జయప్రదం చేయాలి

రామగిరి(నల్లగొండ): మిషన్ ఎడ్యుకేషన్ తెలంగాణలో భాగంగా తెలంగాణ లెక్చరర్స్ ఫోరం(టీఎల్‌ఎఫ్), అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 29న నల్లగొండలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో తెలంగాణ విద్యావ్యవస్థ సమాలోచన అనే అంశంపై నిర్వహించే విద్యా సదస్సును జయప్రదం చేయాలని టీఎల్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొల్లేపల్లి వేణు కోరారు. సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం నల్లగొండలోని రామగిరి చౌరస్తా వద్ద ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సదస్సుకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, టీఎల్‌ఎఫ్ చైర్మన్ డాక్టర్ కత్తి వెంకటస్వామితో పాటు పలువురు మేధావులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం జిల్లా కార్యదర్శి చుక్క సైదులు, సభ్యులు చింత శ్యామ్‌సుందర్, సంపత్, ఉమాశంకర్, బండి అశోక్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలేరును నంబర్ వన్‌గా నిలపాలి



మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకారంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

- అవసరం మేరకు గోదాములు మంజూరు చేస్తాం
- బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదు
- మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఆలేరురూరల్ : నూతన పాలకవర్గం సమన్వయంతో పనిచేసి ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీని రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థానంలో నిలపాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సూచించారు. మార్కెట్ అవసరాల మేరకు గోదాములను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆలేరు మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం ఆదివారం ఆలేరులోని ఏఎస్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. చైర్‌పర్సన్‌గా ఐనాల చైతన్యమహేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా పచ్చిమట్ల మధార్‌గౌడ్‌తో పాటు 16 మంది డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.18 కోట్ల రుణాలు మాఫీ చేశామన్నారు. రైతును రాజును చేయడమే కాంగ్రెస్ సర్కార్ లక్ష్యం అన్నారు. పార్టీకోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని, ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నూతన పాలకవర్గానికి అభినందనలు తెలిపారు.

'గంధమల్ల'తో సస్యశ్యామలం చేస్తాం : కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఆలేరు ప్రాంతానికి సాగునీరు అందించి సస్యశ్యామలం చేయడమే లక్ష్యమని, త్వరలో గంధమల్ల రిజర్వాయర్ పనులకు టెండర్లు పిలుస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. గంధమల్ల ద్వారా లక్షన్నర ఎకరాలు సాగులోకి వస్తుందన్నారు. హరీశ్‌రావు మల్లన్నసాగర్ నీటిని తన ప్రాంతానికి తీసుకెళ్లి ఆలేరును ఎడారిగా మార్చారని ఆరోపించారు. రూ.60 కోట్లతో జీడికల్ ప్లెటైవర్ పూర్తి చేశామని, త్వరలోనే వంగపల్లి ఫ్లై ఓవర్ పనులు పూర్తి చేస్తామని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఒక్క జెడ్పీ చైర్మన్, మున్సిపల్ చైర్మన్ సీటు దక్కకుండా చేస్తామన్నారు. అంతకుముందు మహిళలు బోనాలు ఎత్తుకుని, కోలాటం ఆడుతూ సభావేదిక వద్దకు ర్యాలీగా వచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రెసిడెంట్ అండె సంజీవరెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు సునితాశ్రీనివాస్‌రెడ్డి, సమంత, నీలం పద్మ, మార్కెట్ కమిటీ నూతన డైరెక్టర్లు ఎగ్గిడి యాదగిరి, చిలుకు కిష్టయ్య, సిలువేరు బాలరాజు, విఠల్ నాయక్, ఎండి నసీరుద్దీన్, పుచ్చల జహంగీర్, దేవయ్య, మోతె మైసయ్య, నాయకులు ఎజాజ్, సాగర్‌రెడ్డి, తుంగ కుమార్, పాము అనీత పాల్గొన్నారు.

వరద బాధితులకు స్వేరోస్ అండ



కోదాడ మండల పరిధిలోని తొగర్రాయి గ్రామంలో వరద ముంపు బాధితులకు ఆదివారం నిత్యావసర సరుకులు అందజేస్తున్న స్వేరోస్ నెట్‌వర్క్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్

ఎట్టకేలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

- రామచంద్రాపురం వద్ద గండికి పైభాగన ప్రధాన కాలువలో అడ్డంగా మట్టి పోసిన అధికారులు
- పాలేరు కాలువకు 650 క్యూసెక్కుల నీటి విడుదల
- 10వేల ఎకరాలకు అందనున్న సాగునీరు



సిరిపురం సమీపంలో సాగర్ ప్రధాన కాలువకు అడ్డంగా ఏర్పాటు చేసిన మట్టికట్ట



మునగాల హెడ్ రెగ్యులేటర్ వద్ద పాలేరు కాలువకు నీటిని విడుదల చేస్తున్న అధికారులు, నాయకులు

కోదాడ: ఇరవైమూడు రోజులుగా సాగునీరు లేక పంట పొలాలు ఎండిపోతున్నా పట్టించుకోని నీటి పారుదలశాఖ అధికారులు ఎట్టకేలకు నిద్రమత్తు వీడారు. మునగాల, నడిగూడెం, అనంతగిరి, కోదాడ మండలాల పరిధిలోని 10వేల ఎకరాలకు సాగునీరు అందించడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. సాగర్ కాలువకు పడిన రెండు ప్రధాన గండ్లు పూడ్చేందుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉండడంతో తమ పొలాలను కాపాడాలని రైతులు అధికారులకు విన్నవించారు. దీంతో అధికారులు ఆదివారం అనంతగిరి మండల నాయకులతో కలిసి నీటిని విడుదల చేశారు.

నీటిని కిందికి పోకుండా చేసి..

సాగర్ ప్రధాన కాలువకు రామచంద్రాపురం వద్ద పడిన గండికి పైభాగన ప్రధాన కాలువలో అడ్డంగా మట్టికట్ట పోశారు. అక్కడి నుంచి నీటిని కిందకు పోకుండా చేశారు. ఆ తరువాత మునగాల హెడ్ రెగ్యులేటర్ వద్ద పాలేరు వైపు వెళ్లే ప్రధాన కాలువకు 650 క్యూసెక్కుల నీటిని ఆదివారం ఉదయం వదిలారు. దీని నుంచి పలు ఎత్తిపోతల పథకాలతో పాటు కొమరబండ, కొత్తగూడెం, పాలారం మేజర్లకు సాగునీరు విడుదల చేయనున్నారు. దీంతో మునగాల, నడిగూడెం, అనంతగిరి, కోదాడ మండలాల పరిధిలోని 10 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. మునగాల హెడ్ రెగ్యులేటర్ నుంచి అడ్డుకట్ట వేసిన ప్రాంతం మధ్యలో కాలువకు ఇరువైపులా మోటార్లను ఏర్పాటు చేసుకున్న రైతులకు కూడా నీరు అందనుంది. నీటిని విడుదల చేసినవారిలో ఎన్‌ఎస్‌పీ అధికారులతో పాటు నాయకులు ముస్కు శ్రీనివాసరెడ్డి, బుర్రా పుల్లారెడ్డి, ఈదుల కృష్ణయ్య, వెంపటి వెంకటేశ్వరరావు, డేగ కొండయ్య ఉన్నారు. కాగా.. సాగర్ కాలువ కట్టతెగి 23 మూడు రోజులు కావస్తోందని, అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా నిర్లక్ష్యం వహించారని, ఇప్పటికే చాలా నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు చేసిన ఏర్పాట్లే ఈ నెల 2, 3వ తేదీల్లో చేసి ఉంటే నష్టపోయేవాళ్లం కాదని పేర్కొంటున్నారు.

కొనసాగుతున్న అర్చక శిక్షణ తరగతులు

అర్వపల్లి : తిమ్మాపురంలోని సూర్యనారాయణస్వామి క్షేత్రంలో గ్రామ దేవాలయ రాష్ట్ర స్థాయి అర్చక శిక్షణ తరగతులు మూడు రోజులుగా కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి అర్చకులు హాజరై శిక్షణ పొందుతున్నారు. ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే గ్రామాల్లోని చిన్న చిన్న దేవాలయాల్లో నిత్య పూజలు జరగడం లేదని, అందుకోసం గ్రామ స్థాయిలో అర్చక శిక్షణలు ఇవ్వడానికి తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శిక్షణకు హాజరైన వారికి యోగా తరగతులు కూడా ఏర్పాటు చేశారు. ఈ నెల 26 వరకు ఈ శిక్షణ తరగతులు జరగనున్నాయని నిర్వాహకులు బంటు శ్రీనివాస్, నర్యానాయక్ తెలిపారు. కార్యక్రమంలో సూర్యక్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకుడు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్, ధర్మ జాగరణ సమితి ప్రతినిధులు నందుల లక్ష్మీనర్సింహశాస్త్రి, బాణాల సాయి శర్మ, తీర్థం వెంకటేశ్వరశాస్త్రి పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన అర్చకులు

తెలంగాణ చౌరస్తాలో ఫ్లైఓవర్ నిర్మించొద్దు



తిరుమలగిరిలో సమావేశమైన అఖిలపక్ష నాయకులు

తిరుమలగిరి: తిరుమలగిరిలోని తెలంగాణ చౌరస్తాలో హైవేపై ఫ్లైఓవర్ నిర్మించొద్దని అండర్ పాస్ నిర్మాణ వ్యతిరేక కమిటీ సభ్యులు తెలిపారు. ఆమరణ నిరాహార దీక్ష చేసైనా నిర్మాణాన్ని అడ్డుకుంటామని పేర్కొన్నారు. ఆదివారం మున్సిపాలిటీ కేంద్రంలోని వంగపల్లి నర్సయ్య ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ చౌరస్తాలో అండర్ పాస్ నిర్మించడం వల్ల చిన్నచిన్న వ్యాపారం చేసుకునే ఎంతోమంది జీవితాలు అంధకారమైపోతాయన్నారు. వలిగొండ నుంచి తిరుమలగిరి మీదుగా తొర్రూర్ వరకు నేషనల్ హైవే పనులు సాగుతున్నాయని, తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రం ఇప్పుడిప్పుడే వ్యాపార పరంగా అభివృద్ధి చెందుతున్న క్రమంలో తెలంగాణ చౌరస్తాలో హైవేపై అండర్ పాస్ ఏర్పాటు చేయడంతో పాత గ్రామానికి ఎక్స్ రోడ్డుకు అడ్డంగా గోడ కట్టినట్లుగా ఉంటుందని తెలిపారు. సూర్యాపేట- జనగాం, వలిగొండ- తొర్రూర్ రోడ్డుకు ఇరుపక్కలా ఎంతోమంది చిరు వ్యాపారులు, తోపుడు బండ్లు, బడ్డీ కొట్లు పెట్టుకొని జీవనం సాగిస్తున్న వారి వ్యాపారాలు పూర్తిగా దెబ్బతింటాయని, సుమారు 1000 కుటుంబాలు వీధిన పడతాయన్నారు. ఇంతకుముందే అఖిలపక్షం ఆధ్వర్యంలో అధికారులకు విన్నవించి నిరసనలు తెలిపినా పట్టించుకోకపోవడంతో 23న అఖిలపక్ష ఆధ్వర్యంలో ధర్నాకు దిగుతున్నామని చెప్పారు. అండర్ పాస్ కాకుండా, తెలంగాణ చౌరస్తాలో రోడ్డు నిర్మాణం చేసి సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, లేకుంటే బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అఖిలపక్ష నాయకులు కొమ్మినేని సతీష్ కుమార్, మూల రవీందర్ రెడ్డి, బత్తుల శ్రీను, గుండా భాస్కర్, గజ్జల శేఖర్, కడెం లింగయ్య, కొత్తగట్టు మల్లయ్య, ఎస్. కొండల్ రెడ్డి, కందుకూరి సోమన్న, రాంబాబు, భాస్కర్, మధు, నాని, కందుకూరి ప్రవీణ్, అనగందుల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ జనసమితిని బలోపేతం చేద్దాం

- పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్



మాట్లాడుతున్న కుంట్ల ధర్మార్జున్

చివ్వెంల(సూర్యాపేట): కలుషిత రాజకీయాల ప్రక్షాళనకు తెలంగాణ జనసమితి(టీజేఎస్)ను బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్ అన్నారు. ఆదివారం చివ్వెంల మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ ప్లీనరీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛమైన రాజకీయాలు, పారదర్శకతతో కూడిన పాలన కోసం యువతను ప్రోత్సహించి గ్రామస్థాయి నుంచి చట్టసభల్లో క్రియాశీలకంగా ఉండేలా చూడాలని పిలుపునిచ్చారు. విద్యావంతులైన యువతను వచ్చే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసేలా చూడలన్నారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలతోపాటు, సామాజిక ప్రజాస్వామ్య తెలంగాణ నిర్మాణానికి ఉద్యమ నేత కోదండరాం నాయకత్వంలో ముందుకు సాగాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు ధరావతు సుమన్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గట్ల రమాశంకర్, కిరణ్‌కుమార్, ఎర్ర వీరన్న, పేరాల ప్రశాంత్, దప్పు గోపి, కుంచం చంద్రకాంత్, వీరేష్ నాయక్, పానుగోటి సత్యనారాయణ, బచ్చలకూరి గోపి, ఏనుగు మధుసూదన్‌రెడ్డి, వెంకట్ నారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత

వలిగొండ: అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి నుంచి మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలంలోని సూరేపల్లి పీబీ తండాకు చెందిన మూడవత్ రెడ్యా, రెడ్యానాయక్ తండాకు చెందిన భుక్యా శ్రీను వివిధ గ్రామాల్లో నిరుపేదల నుంచి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. పక్కా సమాచారం మేరకు బైక్లపై రేషన్ బియ్యం తరలిస్తున్న వారిద్దని ఆదివారం అదుపులోకి తీసుకుని మూడు క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

వలిగొండ : తన భర్త కనిపించడం లేదని మండల కేంద్రానికి ఓ మహిళ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండల కేంద్రానికి చెందిన బాలగోని మాధవ్(45) ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం 5గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన మాధవ్ తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అతడి భార్య మాధవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

టిఫిన్ సెంటర్పై కేసు నమోదు

భువనగిరి క్రైం: భువనగిరిపట్టణంలోని మెయిన్ రోడ్డుపై గల ఆంజనేయ టిఫిన్ సెంటర్పై ఆదివారం కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ మల్లేశ్ తెలిపారు. టిఫిన్ సెంటర్లో కమర్షియల్ సిలిండర్లకు బదులు డొమెస్టిక్ సిలిండర్లు వాడుతుండడంతో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టిన బైక్

- ఒకరు మృతి

బొమ్మలరామారం: బైక్ అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన బొమ్మలరామారం మండలంలోని రంగాపూర్ వద్ద ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పటాన్చెరుకు చెందిన సిందే శేషు(30) కమ్మరి కుల వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మేడ్చల్–మల్కాజ్గిరి జిల్లా కీసర గ్రామంలో తమ బంధువు మృతిచెందడంతో శనివారం రాత్రి అంత్యక్రియలకు హాజరై తిరిగి తన స్వగ్రామానికి బైక్పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో బొమ్మలరామారం మండలం రంగాపూర్ చౌరస్తా వద్ద బైక్ అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శేషు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీశైలం తెలిపారు.

అస్వస్థతకు గురై మహిళ మృతి

రామన్నపేట: తీవ్ర అస్వస్థతకు గురై మహిళ మృతిచెందింది. రామన్నపేట మండలం జనంపల్లి గ్రామానికి చెందిన గట్టు రాములు, అరుణ భార్యాభర్తలు. రాములు లారీ డ్రైవర్గా, అరుణ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. రాములు లారీపై వైజాగ్కు వెళ్లాడు. ఆదివారం ఉదయం అరుణ తీవ్ర అస్వస్థతకు గురైంది. ఒక్కసారిగా బీపీ పెరిగి కిందపడిపోయింది. చుట్టుపక్కల వారు గమనించి 108 వాహనంలో నార్కట్పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే ఆమె మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతురాలి మేనమామ జిట్ట శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

వరద బాధితులకు స్వేరోస్ అండగా ఉంటుంది

- స్వేరోస్ నెట్వర్క్ వ్యవస్థాపక ఛైర్మన్ ఆర్ఎస్ ప్రవీణ్కుమార్

కోదాడరూరల్: వరద ముంపునకు గురై నష్టపోయిన బాధితులకు స్వేరోస్ నెట్వర్క్ అండగా ఉంటుందని స్వేరోస్ నెట్వర్క్ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్కుమార్ అన్నారు. ఆదివారం కోదాడ మండల పరిధిలో వరద ముంపునకు గురైన కూచిపూడి, తొగర్రాయి గ్రామాల్లో ఆయన పర్యటించి 250 మంది బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరదలతో నష్టపోయిన ప్రజలను ఆదుకునేందుకు స్వేరోస్ నెట్వర్క్ సొంత డబ్బులతో ముందుకు రావడం అభినందనీయమన్నారు. భారీ వర్షాలకు తూర్పు తెలంగాణ ప్రాంతమంతా తల్లడిల్లిపోయిందని అన్నారు. ఏటూరు నాగారం ప్రాంతంలో వందల సంవత్సరాల వయస్సున్న లక్షలాది చెట్లు నేలకొరిగాయన్నారు. సమాజంలో అసమానతలు తొలగాలంటే చదువు ఒక్కటే మార్గమని తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నతంగా చదివించాలని కోరారు. అంతకుముందు ఆయా గ్రామాల్లో స్థానికులతో కలిసి పర్యటించి వరద వచ్చిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. వరదకు ఇళ్లు కోల్పోయిన వారికి పరామర్శించారు. వరదలో కొట్టుకపోతున్న భార్యభర్తలను కాపాడిన స్వేరోస్ సభ్యుడు చడపంగు రవి, అతడి మిత్రబృందాన్ని ఆర్ఎస్ ప్రవీణ్కుమార్ అభినందించారు. ప్రతిఒక్కరూ తమ కుటుంబాలనే కాకుండా పక్కన ఉండే పేద ప్రజల రష్టాలను తెలుసుకుని వారికి తమ వంతు సహాయం చేయాలని అన్నారు. ఆయన వెంట స్వేరోస్ నెట్వర్క్ చీఫ్ కన్వీనర్ బల్గూరి దుర్గయ్య, వైస్ ఛైర్మన్ బాలప్రసాద్, రాష్ట అధ్యక్షుడు చిలకబత్తిని వీరయ్య, చెరుకుపల్లి కిరణ్, మచ్చా నరసయ్య, మైలారం జగన్, వీరస్వామి, నాగార్జున తదితరులు ఉన్నారు.



తొగర్రాయిలో వరదలకు తడిసన పుస్తకాలను ఆరబెట్టుకున్న విద్యార్థినితో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్కుమార్ తదితరులు

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ఆత్మకూర్(ఎం): కుటుంబ కలహాలతో గడ్డి మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్ (ఎం) మండలం రహీంఖాన్పేట గ్రామానికి చెందిన ముత్యాల కుమార్(35) మండల కేంద్రంలో హోటల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో పదిహేను రోజుల క్రితం కుమార్ గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అతడిని హైదరాబాద్లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.



షేక్ మోసిన్ పాషా (ఫైల్)

రోడ్డు ప్రమాదానికి గురై..

అడ్డగూడూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. అడ్డగూడూరు మండల పరిధిలోని చిర్రగూడూరు గ్రామానికి చెందిన షేక్ ఖాదర్, పర్వీన్ సుల్తానా దంపతుల కుమారుడు షేక్ మోసిన్ పాషా(27) లక్ష్మీదేవికాల్వ గ్రామంలో జూనియర్ లైన్మెన్గా పనిచేస్తున్నాడు. మోసిన్ పాషా 9 నెలల క్రితం బైక్పై భువనగిరికి వెళ్లి తిరిగి చిర్రగూడూరు వస్తుండగా.. భువనగిరి–మోత్కూరు మార్గంలో రోడ్డు ప్రమాదానికి గురై కోమాలోకి వెళ్లాడు. హైదరాబాద్లో కొన్ని నెలలు చికిత్స పొందిన అతడిని కుటుంబ సభ్యులు ఇటీవల సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా.. ఆదివారం సాయంత్రం మృతిచెందాడు.

మునగాల హెడ్రెగ్యులేటర్ నుంచి నీటి విడుదల

నడిగూడెం : రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్కుమార్రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి ఆదేశాల మేరకు నడిగూడెం, అనంతగిరి, కోదాడ మండలాలకు ఆదివారం మునగాల హెడ్ రెగ్యులేటర్ నుంచి సీఈ రమేష్బాబు నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ శివధర్మతేజ, డీఈ రఘు, ఏఈ సత్యనారాయణ, అనంతగిరి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి, నాయకులు వాసు, వెంపటి వెంకటేశ్వరరావు, బుర్రా పుల్లారెడ్డి, డేగ కొండయ్య, గుర్రం వెంకటరెడ్డి, నిండుచర్ల వెంకటేశ్వర్లు, ఈదుల కృష్ణయ్య పాల్గొన్నారు.



మునగాల హెడ్ రెగ్యులేటర్ వద్ద నీటిని విడుదల చేస్తున్న సీఈ రమేష్బాబు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

భువనగిరి క్రైం: బైక్ను కారు ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందారు. ఈ ఘటన భువనగిరి మండలం రాయగిరి శివారులోని వివేరా హోటల్ సమీపంలో ఆదివారం జరిగింది. భువనగిరి రూరల్ ఎస్ఐ వి. సంతోష్కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపేట మండలం కుర్రారం గ్రామానికి చెందిన జూకంటి అయిలయ్య(47), రాగుల బీరయ్య ఆదివారం బైక్పై హైదరాబాద్కు వెళ్లి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా.. మార్గమధ్యలో భువనగిరి మండలం రాయగిరి శివారులోని వివేరా హోటల్ సమీపంలో హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి బైక్ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా.. అయిలయ్య మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి భార్య మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



అయిలయ్య (ఫైల్)

కుర్రారంలో విషాదఛాయలు

రాజాపేట: మండలంలోని కుర్రారం గ్రామానికి చెందిన జూకంటి చినఅయిలయ్య రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె, భార్య ఉన్నారు.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం

నల్లగొండ క్రైం: సైకిల్పై వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని పానగల్లు సమీపంలో ఆదివారం జరిగింది. నాంపల్లి మండలం రేవెల్లి గ్రామానికి చెందిన బిట్టు సత్తయ్య(46) నల్లగొండ పట్టణంలోని శివాజీనగర్లో నివాసముంటూ లెప్రసీ కాలనీ సమీపంలోని రామలక్ష్మణ్ రైస్ మిల్లులో పనిచేస్తున్నాడు. ఆదివారం అతడు సైకిల్పై వెళ్తుండగా పానగల్లు సమీపంలో నార్కట్పల్లి–అద్దంకి రహదారిపై మిర్యాలగూడ వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సత్తయ్య తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్ఐ నాగరాజు తెలిపారు.

డిజిటల్ సభ్యత్వ నమోదులో ముందుంచాలి

నకిరేకల్: కాంగ్రెస్ పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదులో నకిరేకల్ మున్సిపాలిటీని ముందుంచాలని ఆ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ గాజుల సుకన్య అన్నారు. కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం నకిరేకల్లోని వివిధ వార్డుల్లో చేపట్టిన పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదులో ఆమె పాల్గొని మాట్లాడారు. సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మహిళా కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

కూలీలకు పెరిగిన గిరాకీ



సర్నేనిగూడెంలో పత్తి తీస్తున్న మహిళా కూలీలు



పత్తి తీసేందుకు ఆటోలో ఇతర గ్రామాలకు వెళ్తున్న కూలీలు

యాదాద్రి భువనగిరి జిల్లాలో చాలా చోట్ల పత్తి చేలలో పత్తి తీసే పనులు మొదలయ్యాయి. జూన్ మొదటి వారంలో వేసిన పత్తి చేలు ఊడ పగిలి పత్తి వస్తోంది. వరినాట్లు వేసే పనులు ముగియడంతో కూలీలు పత్తి తీసేందుకు ఆటోలల్లో పక్క మండలాలకు వెళ్తున్నారు. రోజు వారి కూలీ చెల్లిస్తూ ఆటో కిరాయిని సైతం రైతులే భరిస్తున్నారు. – రామన్నపేట

రైతులకు అందని సహాయం

- దేవాదుల కాల్వ నిర్మాణనికి రైతుల నుంచి భూమి సేకరించిన ప్రభుత్వం
- తీసుకున్న భూమికి సమానంగా ఆన్లైన్లో రెండోసారి కట్ అయిన భూమి
- రైతు బంధు, రుణాలు అందక ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు

గుండాల: రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రైతు బంధుతో పాటు స్వల్ప, దీర్ఘకాలిక పంట రుణాలు అందకుండా పోతున్నాయి. గుండాల మండలంలో 2010–11 సంవత్సరంలో దేవాదుల కాల్వ నిర్మాణానికి భూసేకరణ చేపట్టి రికార్డులను ధరణి పోర్టల్లో సక్రమంగా నమోదు చేయకపోవడంతో రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయం అందడం లేదు. దీంతో గత నాలుగు సంవత్సరాలుగా రైతు బంధు, రుణాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుండాల మండలంలో 17 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. అందులో 16 గ్రామాలలో దేవాదుల కాల్వ నిర్మాణం కోసం అప్పటి ప్రభుత్వం సుమారుగా 607 మంది రైతుల నుంచి 950 ఎకరాల భూమి సేకరణ చేసింది. భూసేకరణ అనంతరం రైతుల వద్ద సేకరించిన భూమికి తప్ప మిగతా భూమికి రైతు బంధు పడింది. ఆన్లైన్లో పహాణి వచ్చింది. కానీ ధరణి వచ్చిన తర్వాత భూములకు సంబంధించిన వివరాలను ధరణి పోర్టల్లో నమోదు చేశారు. అయితే అప్పటికే రైతుల వద్ద కాల్వల నిర్మాణం కొరకు సేకరించిన భూమిని రికార్డుల నుంచి తీసివేశారు. తిరిగి అంతే భూమిని ఆన్లైన్లోనూ తొలగించారు. దీంతో రైతులకు రుణాలతో పాటు రైతు బంధు అందడం లేదు. రెండుసార్లు భూములు కోల్పోయిన రైతులు అధికారులకు విన్నవించినా, దరఖాస్తులు చేసినా నేటికీ పరిష్కారం కాలేదు. గతంలో భూసేకరణ కోసం ప్రభుత్వం సేకరించిన భూమిని నోషనల్ ఖాతా నంబర్ 2000508లో వేయాలి. కాని అట్టి ఖాతాలో సేకరించిన భూమి వివరాలను రెవెన్యూ అధికారులు పొందుపరచలేదు. దీంతో రెండుసార్లు భూమిని కోల్పోవాల్సి వచ్చింది. అధికారులు చేసిన పొరపాట్లకు రైతులకు గత 8 దఫాలుగా రైతు బంధు సహాయం అందడం లేదు. మండలంలోని అనంతారం, మాసాన్పల్లి, సుద్దాల, వస్తాకొండూర్, గుండాల గ్రామాలలో సుమారుగా 50 మంది రైతులు మీసేవలో దరఖాస్తులు చేసుకొని నెలలు గడుస్తున్నా సమస్య పరిష్కారం కావడంలేదని చెబుతున్నారు. మీసేవలో దరఖాస్తు చేసుకున్న రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పంట రుణాల కొరకు బ్యాంకులకు వెళితే ఛార్జి క్రియేషన్ రావడం లేదని బ్యాంకర్లు రుణాలు ఇవ్వలేమని చెబుతున్నారు. ఇప్పటికైనా తమ సమస్యను పరిష్కరించాలని బాధిత రైతులు కోరుతున్నారు. తహసీల్దార్ జలకుమారిని వివరణ కోరగా.. భూములు కోల్పోయిన రైతులు వివరాలను నివేదిక తయారు చేసి జిల్లా కలెక్టర్కు పంపామని తెలిపారు. త్వరలోనే సమస్య పరిష్కారమవుతుందని అన్నారు.



పిచ్చి మొక్కలతో నిండిపోయిన దేవాదుల కాల్వ

ఆన్లైన్లో పహాణి రావడం లేదు



పాచిల్ల గ్రామంలోని సర్వే నంబర్ 785లో నాకున్న 1.13 ఎకరాల భూమిని దేవాదుల కాల్వ నిర్మాణం కోసం ప్రభుత్వం సేకరించింది. ధరణి వచ్చిన తర్వాత ఆన్లైన్లోనూ 1.13 ఎకరాల భూమిని తొలగించారు. దీంతో పంట రుణం కోసం బ్యాంకులకు వెళ్తే ఆన్లైన్ పహాణి తీసుకొని వస్తేనే రుణం ఇస్తామని చెబుతున్నారు. ఆన్లైన్లో పహాణి రావడం లేదు. ప్రభుత్వం అందిస్తున్న రైతు బంధు సహాయం రావడం లేదు.

– అత్తి సత్తయ్య, రైతు, పాచిల్ల గ్రామం

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న బంజార ఉద్యోగుల సంఘం నాయకులు

మిర్యాలగూడ టౌన్: ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపాలని బంజార ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథనాయక్ కోరారు. ఆదివారం మిర్యాలగూడలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్సీ నివేదిక తెప్పించుకొని వాటిపై ఉద్యోగ సంఘాలతో చర్చించి వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమలు పరిచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగులకు హెల్త్కార్డులపై ఎలాంటి షరతులు లేకుండా కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించేలా ఆదేశాలను జారీ చేయాలన్నారు. ఎన్నికల సమయంలో బదిలీ చేసిన రెవెన్యూ, పంచాయతీరాజ్ ఉద్యోగులను తిరిగి పూర్వ స్థానాలకు పంపాలన్నారు. అన్నీ శాఖలలో అర్హత ఉన్న ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు గోపినాయక్, జంలానాయక్, సైదానాయక్, లాలునాయక్, మక్లానాయక్, రమేష్నాయక్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మూసీకి పెరిగిన ఇన్ఫ్లో

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్ఫ్లో ఆదివారం పెరిగింది. దీంతో అధికారులు ప్రాజెక్టు మూడు క్రస్ట్ గేట్లను పైకెత్తి వరదనీటిని దిగువకు వదిలారు. హైదరాబాద్ నగరంతో పాటు మూసీ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ఆదివారం మూసీ ప్రాజెక్టుకు 4,400 క్యూసెక్కుల ఇన్ఫ్లో వస్తోంది. దీంతో 645 అడుగుల గరిష్ట నీటి మట్టం గల మూసీ రిజర్వాయర్లో 644.50 అడుగులకు చేరుకుంది. మూసీలో నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరువలో ఉండడంతో అధికారులు ఆదివారం ఉదయం ప్రాజెక్టు మూడు క్రస్ట్ గేట్లను రెండు అడుగుల మేర పైకెత్తి 4వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా ఆయకట్టు భూములకు 435 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మూసీ రిజర్వాయర్లో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్య 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.32 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు దిగువన భీమారం గ్రామం వద్ద వాగులో ఇద్దరు పశువుల కాపర్లు చిక్కుకోవడంతో పైకెత్తిన మూడు గేట్లను అధికారులు సాయంత్రం మూసి వేశారు.



దిగువకు పోతున్న మూసీ నీరు

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

HOUSE FOR SALE

- First&Best Duplex Luxury Villas. Ready To Occupy! Spacious 2,3 & 4 BHK Villas in Miryalaguda, Right Next To New D-Mart Enjoy Modern Amenities. Clubhouse. Swimming Pool. Call: Ph: 7013578378. [HA-663]

Wanted

- BHEL, యాదాద్రి కొరకు Ex-serviceman (మాజీ సైనికులు), CRPF/BSF/పారా మిలిటరీ వ్యక్తులు 58 మంది కావలెను. ఆసక్తిగలవారు సంప్ర : R. వెంకట రమణ రావు సెక్యూరిటీ ఏజెన్సీ. 9246821022 [HA-14712]

- ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1185451]

- సూర్యాపేట పరిసర ప్రాంతాల్లో సెక్యూరిటీ గార్డ్స్, జీతం : 12 వేలు, సూపర్వైజర్స్ జీతం 15 వేలు, అర్హత : 10th పాస్/ఫెయిల్, వయస్సు: 20–50 సం॥ల లోపు, సంప్ర. 98485 11656 [M-1185453]

- సెక్యూరిటీ గార్డ్స్ జీతం 15,000/- మేళ్ళచెరువులో కావలెను. 8 గం॥ డ్యూటీ, తక్కువ రేటుకే భోజనం. ☏ 63008 79854, 86884 17132 [B-246]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గ్రామీణ రైతుల సాంకేతిక సేద్యం

- పెరుగుతున్న వ్యవసాయ యాంత్రీకరణ
- పల్లెల్లోనూ డ్రోన్ల వినియోగం
- సులువుగా పురుగు మందులు పిచికారీ చేసుకుంటున్న రైతులు

త్రిపురారం: గ్రామీణ ప్రాంతాల్లో రైతులు సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వినియోగించుకుంటూ పంటలు సాగు చేస్తున్నారు. కూలీల కొరత తీవ్రంగా ఉండడంతో ఇప్పటికే దుక్కులు, దమ్ములు, విత్తనాలు విత్తడం వంటి పనుల్లో యాంత్రీకరణ పెరిగింది. దీంతో పాటు పంటలకు ఆశించే చీడపీడలు, తెగుళ్ల నివారణకు డ్రోన్లను వినియోగించేందుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతులు వరి, పత్తి, బత్తాయి, అపరాలు, కూరగాయల పంటలకు డ్రోన్ల సహాయంతో పురుగు మందులు పిచికారీ చేస్తుండడంతో ఇతర రైతులు కూడా అటువైపు ఆసక్తి చూపుతున్నారు. డ్రోన్ విధానంతో సమయం ఆదా కావడంతో పాటు కూలీలు అవసరం లేకపోవడం వల్ల పెట్టుబడి ఖర్చులు కూడా తగ్గుతున్నాయని రైతులు అభిప్రాయపడుతున్నారు.

ఖర్చు తక్కువ.. సమయం ఆదా

హ్యాండ్ స్ప్రేయర్లు, తైవాన్ స్ప్రేయర్లు, బ్యాటరీ ద్వారా నడిచే స్ప్రేయర్లతో పురుగు మందులు పిచికారీ చేయాలంటే కూలీల అవసరం ఉంటుంది. ప్రస్తుతం కూలీల కొరత తీవ్రంగా ఉండడంతో సరైన సమయంలో పనులు కాకపోవడం వల్ల పంటలను నష్టపోవాల్సి వస్తుంది. స్ప్రేయర్ల ద్వారా మందులు పిచికారీ చేయడం వలన మనుషులపై విష ప్రభావాలు చూపుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ట్రాక్టర్లకు పెద్ద స్ప్రేయర్లు బిగించి పిచికారీ చేసినా పొలం అంతటా మందు చేరడం లేదు. వరి, పత్తి, మిర్చి, పెసర, మినుము, శనగ, వేరుశనగ, కూరగాయ పంటల్లో పెద్ద స్ప్రేయర్లతో మందులు పిచికారీ చేయడం కష్టంగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో డ్రోన్ల వైపు గ్రామీణ రైతులు మొగ్గుచూపుతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం పెరగడంతో కొందరు రైతులు సొంతంగా కొనుగోలు చేస్తున్నారు. మరికొందరు రైతులు అద్దెకు డ్రోన్లు తెచ్చుకుంటున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు విస్తృతంగా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నారు.

కెమెరాతో సులభంగా..

కెమెరా అమర్చి ఉన్న అగ్రికల్చర్ డ్రోన్ స్ప్రేయర్లు బ్యాటరీ ద్వారా పనిచేస్తాయి. సులభంగా రిమోట్ కంట్రోల్ ద్వారా దీనిని నియంత్రిస్తు 10 నిమిషాల వ్యవధిలోనే సుమారు ఎకరం పంటపై పురుగుమందు పిచికారీ చేయవచ్చు. డ్రోన్ స్ప్రేయర్లకు ఉండే కెమెరా ఆధారంగా పిచికారి సమపాలల్లో జరిగే విధంగా పర్యవేక్షించే అవకాశం ఉండడంతో సులువుగా పని పూర్తవుతుంది. ప్రభుత్వంతో పాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు సైతం అగ్రికల్చర్ డ్రోన్ల వినియోగం పెరగడం కోసం కృషిచేస్తున్నారు.



బాబుసాయిపేటలో డ్రోన్ సహాయంతో వరి పొలంలో పురుగు మందు పిచికారీ చేసుకుంటున్న రైతులు

పాడిపంట

కూలీలు దొరకకపోవడం వల్లే..



పంటల్లో పురుగుమందులు పిచికారీ చేయడానికి కూలీల కొరత తీవ్రంగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాం. సమయానికి మందులు పిచికారీ చేయకపోవడం వల్ల పంట నష్టపోతున్నాం. డ్రోన్తో పిచికారీ సులువుగా ఉంటుంది. పంటలకు సమపాలల్లో మందు పడడంతో పాటు సమయం, ఖర్చులు తగ్గుతున్నాయి.

– గోపగాని హరి ప్రసాద్, రైతు, బాబుసాయిపేట

యాంత్రీకరణతోనే అధిక దిగుబడులు



వ్యవసాయంలో యాంత్రీకరణ వలన దిగుబడులు పెరుగుతాయి. మారుతున్న కాలంతో పాటు రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలతో యాంత్రీకరణ వైపు మొగ్గుచూపాలి. కేవీకే ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లాలోని రైతులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం.

– డాక్టర్ శ్రీనివాసరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్, కేవీకే కంపాసాగర్